సాక్షి ఖమ్మం
మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



భ్రష్టు పడుతున్న విద్యారంగం
ప్రస్తుత పరిస్థితుల్లో పాలకులు రోజురోజుకు విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ప్రొఫెసర్ హరగోపాల్ ఆరోపించారు. 8లో



ప్రజలను మభ్యపెడుతున్న సర్కార్
కేంద్రప్రభుత్వం మనోభావాల పేరిట ప్రజలను మభ్యపెడుతోందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ పేర్కొన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 18°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఉదయం చలి ప్రభావం ఉంటుంది. ఆ తర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

వచ్చేనెల20న డాక్ అదాలత్

ఖమ్మంగాంధీచౌక్: ప్రాంతీయ స్థాయి డాక్ అదాలత్‌ను వచ్చేనెల 20వ తేదీన ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సేవలపై ఫిర్యాదులను మార్చి 1వ తేదీ వరకు పంపించొచ్చని పేర్కొన్నారు. ఈమేరకు ఫిర్యాదులను '45వ డాక్ అదాలత్ పేరిట కె.శ్రీకాంత్ అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టు మాస్టర్ జనరల్, హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్ - 500001' చిరునామాకు పంపించాలని సూచించారు. ఫిర్యాదుపత్రంపై వెంట ఫోన్ నంబర్, ఈ-మెయిల్, చిరునామా స్పష్టంగా రాయాలని తెలిపారు. కాగా, ఆన్‌లైన్‌లో నిర్వహించే డాక్ అదాలత్‌లో ఈ ఫిర్యాదులను అనుసంధానం చేస్తామని ఆయన వెల్లడించారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి



బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీఈఓ

మధిర: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. మధిర, ఎర్రుపాలెం మండలాల ప్రభుత్వ, సోషల్ వెల్ఫేర్, కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం మధిర టీవీఎం పాఠశాలలో సోమవారం ఏర్పాటుచేశారు. ఈసమావేశంలో డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అభ్యాస దీపికల ద్వారా సీ, డీ గ్రేడ్ విద్యార్థులు కూడా ఉత్తీర్ణులయ్యేలా బోధించాలని తెలిపారు. అనంతరం మధిరలోని పలు పాఠశాలలను ఆయన ఎంఈఓ ప్రభాకర్‌తో కలిసి తనిఖీ చేశారు.

వారసులు పట్టించుకోవడం లేదు..



ఫిర్యాదు వివరాలు తెలుసుకుంటున్న సీపీ

ఖమ్మంక్రైం: వృద్ధాప్యంలో తమను వారసులు పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు సీపీ సునీల్‌దత్‌కు ఫిర్యాదు చేశారు. కమిషరేట్ కార్యాలయంలో సోమవారం ప్రజాదివస్ నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను సీపీ స్వీకరించారు. ఇందులో ఎక్కువగా వారసులు పట్టించుకోవడం లేదనే ఉండగా, విచారించి చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలను సీపీ ఆదేశించారు.

ఎండుతున్న పంటలను పరిశీలించిన అధికారులు



కోనాయిగూడెంలో ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ

సాక్షి ఎఫెక్ట్..

నేలకొండపల్లి: నీరు అందక ఎండిపోతున్న వరి పొలాలను వ్యవసాయాధికారులు సోమవారం పరిశీలించారు.'పాతాళం లోకి గంగ' శీర్షికన రైతుల వెతలపై 'సాక్షి'లో సోమవారం కథనం ప్రచురితం అధికారులు రంగంలోకి దిగారు. నేలకొండపల్లి ఏఓ అరుణకుమారి, ఏఈఓ అవినాష్ ఆచార్లగూడెం, కోనాయిగూడెం గ్రామాల్లో ఎండుతున్న వరి పొలాలను పొలాలను పరిశీలించారు. రైతులు ఆనం వెంకటరెడ్డి, మార్తి రాములు, పగడాల సైదులు, లింగనబోయిన వీరస్వామి తదితరులు మాట్లాడుతూ అత్యవసరంగా సాగునీరు విడుదల చేయకపోతే పంటను పూర్తిగా వదులుకోవాల్సి ఒదేనని తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు ఏఈఓ తెలిపారు.

నేటి నుండి ప్యాసింజర్ రైళ్లు

ఖమ్మం మామిళ్లగూడెం: మూడో రైల్వేలైన్ పనులతో కొన్నినెలలుగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు పలు ప్యాసింజర్ రైళ్లను రద్దుచేశారు. ప్రస్తుతం పనులు పూర్తికావడంతో మంగళవారం నుండి ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు మొదలుకానున్నాయని ఖమ్మం సీసీఐ జాఫర్ తెలిపారు. ఈమేరకు డోర్నకల్-విజయవాడ (07755), విజయవాడ-డోర్నకల్(07756), భద్రాచలం రోడ్-విజయవాడ(07278), విజయవాడ-భద్రాచలం రోడ్(07979) ప్యాసింజర్ రైళ్లు పాత సమయం ప్రకారమే నడుస్తాయని ఆయన వెల్లడించారు.

పగటిపూట నిర్మానుష్యంగా ఉన్న ఇల్లెందు రోడ్డు



అప్పుడే ఎండ!

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం చలి, మంచు ప్రభావం ఉంటున్నా వారం రోజులుగా మధ్యాహ్నం అయ్యేసరికి 36 డిగ్రీల నుండి 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదవుతుంది. సోమవారం సైతం ఖమ్మంలో 36డిగ్రీల మేర ఉష్ణోగ్రత ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పగటి పూట ఎండ పెరగడంతో చాలా మంది బయటకు రావడం లేదు. దీంతో రోడ్లు ఖాళీగా కనిపించాయి. అలాగే, బయటకు వచ్చినవారు వేడి నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



చీర కొంగు కప్పుకుని వెళ్తున్న మహిళ



బోసిపోయి కనిపిస్తున్న ఐటీ హబ్ సెంటర్



చిన్నారికి రక్షణ కోసం కండువా కప్పిన దృశ్యం

చలో నల్లగొండ..



కృష్ణా జలాల అంశంపై నేడు బీఆర్‌ఎస్ సభ

- నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో జన సమీకరణ
- పాలేరు, ఖమ్మం, వైరా, సత్తుపల్లి, మధిర నుంచి తరలింపు
- ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న 'గులాబీ' నేతలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా నది ప్రాజెక్టులపై కేంద్రానికి పెత్తనం ఇచ్చిందని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన నల్లగొండలో మంగళవారం నిర్వహిస్తున్న సభకు తరలివెళ్లేందుకు జిల్లాలోని ఆ పార్టీ శ్రేణులు సన్నద్ధమయ్యాయి. ప్రధానంగా ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, వైరా, మధిర నియోజకవర్గాల నుంచి సమీకరణ చేస్తుండగా.. ఇప్పటికే పార్టీ ముఖ్య నేతలు, మాజీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన తొలిసారి నిర్వహిస్తున్న కార్యక్రమం కావడంతో నేతలు జనసమీకరణలో నిమగ్నమయ్యారు.

పోరాటాలకు సైరన్

కృష్ణా నది పరీవాహకంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఒక్కో స్థానమే దక్కింది. దీంతో ఈ జిల్లాల్లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో వచ్చిన ఏ అవకాశాన్ని కేసీఆర్ వదులుకోవడం లేదనే చర్చ సాగుతోంది. ఇందులో భాగంగానే పోరాటాలకు సైరన్‌లా కృష్ణా జలాల అంశాన్ని ఎంచుకున్నట్లు చెబుతున్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా సాగర్ ఆయకట్టు పరిధిలోని పాలేరు, ఖమ్మం, వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల నుంచి నల్లగొండ సభకు రైతులు, శ్రేణులను తరలించేందుకు వారం రోజులుగా ప్రచారం చేస్తున్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి.. ఈ కార్యక్రమానికి రైతులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని ఇప్పటికే పిలుపునిచ్చారు.

కృష్ణా ఆయకట్టు కావడంతో..

జిల్లాలోని 17 మండలాలు కృష్ణా నది పరీవాహకంలోని నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్నాయి. ఏటా వానాకాలంలో మూడు లక్షల ఎకరాలు, యాసంగిలో రెండు లక్షల ఎకరాల మేర ఇక్కడ పంటలు సాగవుతాయి. ఈసారి వర్షాభావంతో వానాకాలంతో పాటు, యాసంగిలోనూ సాగర్‌లో నీళ్ల లేక ఆయకట్టుకి నీరు విడుదల చేయలేదు. దీంతో బోర్లు, బావుల కిందే రైతులు పంటలు సాగు చేశారు. చెరువుల్లో కూడా నీళ్లు అడుగంటడంతో ప్రస్తుతం భూగర్భ జలాలు పడిపోయి జిల్లాలో పలు చోట్ల పంటలు ఎండుతున్నాయి. ఈ నేపథ్యాన కృష్ణా నది ప్రాజెక్టుల బాధ్యతను రాష్ట్రం కేంద్రానికి అప్పగించిందనే ఆరోపణలతో రాజకీయం వేడెక్కింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నేతలు పరస్పరం చేసుకుంటున్న విమర్శలు తారాస్థాయికి చేరాయి. ఈమేరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహిస్తున్న సభకు ప్రాధాన్యత సంతరించుకుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సభకు హాజరుకానుండగా.. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో జనసమీకరణపై బీఆర్‌ఎస్ నాయకత్వం దృష్టి సారించింది.

భక్తరామదాసు జయంతి ఉత్సవాలు ప్రారంభం



రామదాసు కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అర్చకులు, అధికారులు, నాయకులు

నేలకొండపల్లి: పరమ భక్తాగ్రేసరుడు, కంచర్ల గోపన్న(భక్త రామదాసు) జయంతి ఉత్సవాలు ఆయన స్వస్థలమైన నేలకొండపల్లిలో సోమవారం ప్రారంభమయ్యాయి. భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా యంత్రాంగం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రా స్వామి దేవస్థానం, శ్రీ భక్తరామదాసు విద్వత్ కళాపీఠం సంయుక్త ఆధ్వర్యాన మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. తొలి రోజు రామదాసు ధ్యానమందిరంతో పాటు శ్రీ భక్తరామదాసు కాంస్య విగ్రహానికి అభిషేకం చేశాక నగర సంకీర్తన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన కళాకారులు తమ గానాలతో ఆకట్టుకోగా, రామదాసు వేషధారణలో చిన్నారులు ప్రదర్శన ఇచ్చారు. అలాగే, కాంగ్రెస్ నాయకుడు జెర్రిపోతుల అంజిని, భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన కూడా రామదాసు జయంతి నిర్వహించారు. రామదాసు మందిరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి సుమన్‌చక్రవర్తి, ప్రజాప్రతినిధులు, నాయకులు బొందయ్య, దోసపాటి కల్పన, శీలం వెంకటలక్ష్మి, వంగవీటి నాగేశ్వరరావు, ఎం.వెంకన్న, నంచర్ల దేవీప్రసాద్, కడియాల నరేష్, ఓరుగంటి నారాయణరావు, సామాల కోటేశ్వరరావు, దోసపాటి శేఖర్‌తో పాటు అర్చకుడు సౌమిత్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా ఎక్సైజ్ సీఐల బదిలీలు

- మూడేళ్ల తర్వాత స్థానచలనం
- ఆ స్థానాల్లో ఇతర జిల్లాల నుంచి కేటాయింపు

ఖమ్మంక్రైం: జిల్లాలో ఎక్సైజ్ శాఖలో ఒకేసారి పెద్ద సంఖ్యలో సీఐలను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఖమ్మం స్టేషన్-1 సీఐ కె.రాజును ఖిలా వరంగల్‌కు బదిలీ చేయగా, ఖమ్మం స్టేషన్-2 సీఐ రాజిరెడ్డిని మణుగూరుకు, నేలకొండపల్లి సీఐ పోశెట్టిని పెద్దపల్లికి, ఖమ్మం డీటీఎఫ్ సీఐ ఆర్.విజేందర్‌ను ఆదిలాబాద్‌కు, ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు సామ్యూల్ జాన్‌కు కాగజ్‌నగర్‌కు, సర్వేశ్వరరావును జగిత్యాలకు బదిలీ చేశారు. సత్తుపల్లి ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న రాజశేఖర్‌రావును వేములవాడకు, మధిర సీఐ ప్రసాద్‌ను పాల్వంచకు, వైరా సీఐగా పనిచేస్తున్న రమ్యను భూపాలపల్లికి బదిలీ చేశారు. ఇక మహబూబాబాద్ డీటీఎఫ్ సీఐ ఎ.కృష్ణను ఖమ్మం -1 సీఐగా, భూపాలపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని సత్తుపల్లికి, మణుగూరు సీఐ రామ్మూర్తిని మధిరకు, కాటారం ఎస్‌హెచ్‌ఓ ప్రశాంతిని సింగరేణి ఎస్‌హెచ్‌ఓగా, నాచారంలో పనిచేస్తున్న మమతను వైరాకు, పరకాల సీఐగా విధులు నిర్వర్తిస్తున్న జగన్నాథరావును నేలకొండపల్లి సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కదలివచ్చిన యంత్రాంగం

- మధిరలో ప్రజావాణి
- కలెక్టర్ గౌతమ్ సహా అధికారుల హాజరు
- ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారంపై భరోసా

మధిర: ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిని ఈ వారం మధిరలో నిర్వహించారు. నియోజకవర్గాల ప్రజలకు దూరాభారం తప్పించేందుకు కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మధిరలో నిర్వహించిన గ్రీవెన్స్ డేకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌తో పాటు అన్ని శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అయితే, ప్రజల నుంచి అందిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంతో పాటు స్కాన్ చేయడానికి సమకూర్చిన కంప్యూటర్లు మొరాయించాయి. దీంతోగంటకు ఒక దరఖాస్తు కూడా ఆన్‌లైన్ చేయకలేకపోగా హెల్ప్ డెస్క్ వద్ద దరఖాస్తుదారులు గుమిగూడారు. ఈ విషయాన్ని గుర్తించిన కలెక్టర్ గౌతమ్ ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు వందలాదిగా తరలివచ్చి సమస్యలపై వినతిపత్రాలు, ఫిర్యాదులు అందజేయగా సమస్యల పరిష్కారంపై అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇలాకాలో తొలిసారి నిర్వహించిన గ్రీవెన్స్ డేలో అందిన ఫిర్యాదులు పరిష్కారానికి నోచుకుంటాయా లేక గతంలో మాదిరి పెండింగ్ పెడతారా అని దరఖాస్తులు ఎదురుచూస్తున్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని....

- మధిరకు మంజూరైన సబ్ కోర్టు నిర్వహణకు సమీకృత మార్కెట్ భవనం, వ్యవసాయ మార్కెట్‌లో ఖాళీగా ఉన్న రైతుల విశ్రాంతి భవనాల్లో ఒకటి కేటాయించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోజెడ్ల పుల్లారావు, న్యాయవాదులు వినతిపత్రం అందజేశారు. ఈ విషయపై కలెక్టర్ స్పందిస్తూ తన తండ్రి కూడా న్యాయవాదేనని, ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.
- మధిర లడక బజార్‌లో పేదలు ఇళ్లు తొలగించి రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి సిద్ధం చేసిన ప్రతిపాదనలను రద్దుచేయాలని 17, 18, 21 వార్డుల ప్రజలు కోరారు. దీంతో ఈ నిర్మాణం చేపట్టొద్దని ఆర్ అండ్ బీ అధికారులతో పాటు మున్సిపల్ కమిషనర్ రమాదేవిని కలెక్టర్ ఆదేశించారు.
- ఆత్కూరు గ్రామానికి చెందిన మీనుగు వేణుగోపాల్, నిధానపురం గ్రామానికి చెందిన అమరవాది బిందు, దర్శి మౌనిక, మాటూరుపేట గ్రామానికి చెందిన సంపసాల సూరమ్మ తదితరులు తాము పలుమార్లు ఆసరా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అన్ని అర్హతలు ఉండి పింఛన్ రాకపోవడంతో పడుతున్న ఇబ్బందులను వివరించారు.
- మధిర మున్సిపాలిటీలో విలీనమైన మడుపల్లి, ఇల్లెందులపాడు, అంబారుపేటల్లో ఉన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ కావడం లేదని మల్లాది సేవా సమితి సభ్యులు గూడెల్లి నాగరాజు, అన్నవరపు సత్యనారాయణ తదితరులు వివరించగా, సబ్ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేశారు.
- దెందుకూరు సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన రైతులు పొలాలకు వెళ్లేలా రహదారి మంజూరు చేయాలని కోరారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు




ఆన్‌లైన్ కాకపోవడంతో వేచిఉన్న దరఖాస్తుదారులు

ఆదర్శంగా ఇందిరమ్మ డెయిరీ

త్వరలోనే ఏర్పాటయ్యే ఇందిరమ్మ డెయిరీని ఆదర్శంగా తీర్చిదిద్దేలాలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మధిర మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధికారులు, బ్యాంకర్లు, పాడిరైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ మండలానికి 4వేలకు తక్కువ కాకుండా నియోజకవర్గంలో 20వేల మందిని సభ్యులుగా చేర్పించాలని సూచించారు. రోజుకు లక్ష లీటర్ల పాలను శీతలీకరణ యూనిట్‌కు పంపే లక్ష్యంగా కార్యాచరణ ఉండాలని తెలిపారు. అలాగే, సాధారణ మౌలిక సదుపాయాల కల్పనకు వాటాధనం ఉపయోగిస్తామని, సభ్యులకు సబ్సిడీ రుణాల ద్వారా పాడి గేదెలు అందుతాయని చెప్పారు. ఈమేరకు వెంటనే కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, డీఆర్డీఓ విద్యాచందన, జిల్లా పశుసంవర్ధక అధికారి వేణుమనోహర్, డీఏఓ విజయనిర్మల, డీసీఓ విజయకుమారి, బీసీ సంక్షేమ అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆస్పత్రి భవనాలను పరిశీలించారు.

పరిష్కారం కావాలి



రెండేళ్లుగా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నాను. దరఖాస్తు చేసినట్లుగా ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. కానీ పెన్షన్ మంజూరు కావడం లేదు. గతంలో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా. ఈసారి కలెక్టర్ ఇక్కడే దరఖాస్తు తీసుకోవడంతో పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం.

– ఎం.వేణుగోపాల్, దివ్యాంగుడు, ఆత్కూరు

పెన్షన్ రావడం లేదు



రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాను. సదరం సర్టిఫికెట్ కూడా వచ్చింది. బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. ఆర్థికంగా సమస్య ఎదుర్కొంటున్నాను. నూతన ప్రభుత్వంలోనైనా పెన్షన్ మంజూరు అవుతుందని ఎదురుచూస్తున్నాను.

– అమరవాది బిందు, నిధానపురం

ఖమ్మం డీఆర్‌డీఓగా సన్యాసయ్య

భద్రాద్రి జిల్లాకు విద్యాచందన బదిలీ



సన్యాసయ్య

ఖమ్మంమయూరి సెంటర్: ఖమ్మం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి(డీఆర్‌డీఓ) ఎం. విద్యాచందన భద్రాద్రి జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే, ఖమ్మం అడిషనల్ డీఆర్‌డీఓ బి.శిరీషను సూర్యాపేట డిప్యూటీ సీఓగా బదిలీ చేశారు. ఇక మహబూబాబాద్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆర్.సన్యాసయ్య ఖమ్మంకు బదిలీ పై రానున్నారు. ఈమేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సన్యాసయ్య గతంలో ఖమ్మం అడిషనల్ డీఆర్‌డీఓగా విధులు నిర్వర్తించారు. కాగా, 2021 ఏప్రిల్ 7న ఖమ్మం డీఆర్‌డీఓగా బాధ్యతలు చేపట్టిన విద్యాచందన ఉపాధి పనులు, మహిళా సంఘాల నిర్వహణతో పాటు ఏఎఫ్‌పీసీల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టారు. అలాగే, మహిళా సంఘాల సభ్యులతో మిర్చి కొనుగోళ్లు చేయించి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచారు.

జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ కూడా..

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం జెడ్పీ సీఈఓ వీ.వీ. అప్పారావును సూర్యాపేట జిల్లా సీఈఓగా, డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖర్‌ను భద్రాద్రి జిల్లాకు బదిలీచేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, అప్పారావు స్థానంలో తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.వినోద్‌ను జెడ్పీ సీఈఓగా నియమించారు.

సత్తుపల్లి ఏసీపీగా రఘు

సత్తుపల్లి: సత్తుపల్లి ఏసీపీగా ఏ.రఘును నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇక్కడ ఏసీపీగా ఉన్న బి.రామానుజంను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ స్థానంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీగా ఉన్న రఘును కేటాయించారు.

క్లుప్తంగా

నేడు ఏఐఎస్ఎఫ్ టాలెంట్ టెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసేందుకే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన ట్యాలెంట్‌టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. వంద మార్కులకు నిర్వహించే పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్‌తో పాటు కౌశిక్, రాకేష్, రోహిత్, ప్రతాప్, నరేష్, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం జిల్లాస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ ఎంపిక పోటీలకు 145మంది బాలురు, 65మంది బాలికలు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారితో ఎంపికచేసిన జట్లు.. ఈనెల 16నుంచి సూర్యాపేట జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటాయని అసోసియేషన్ కార్యదర్శి కె.క్రిస్టోఫర్‌బాబు, నిర్వాహకులు సీహెచ్.సుధాకర్, సత్యనారాయణ, చంద్రశేఖర్, నరేష్, శివ రామకృష్ణ, శివజ్యోతి, ప్రవీణ్ తెలిపారు. కాగా, బాలుర జట్టుకు పి.గోపి, భానుప్రసాద్, సోను, ఉపేందర్, సతీష్, మార్టిన్, నాని, గణేష్, అజయ్ పార్థు, అజయ్‌కుమార్, మనోజ్, శరత్‌సింగ్, కౌశిక్, రాజేష్, బాలికల జట్టుకు హానీ, నందిని, శైలజ, అమృత, రిజ్వాన, నాగహాసిని, ఆసియా, కీర్తన, వంశిక, సానియా మిర్జా, కుసుమ, మనీషా, జ్యోత్స్న,అశ్విత, భవ్యశ్రీలు ఎంపికయ్యారని వెల్లడించారు.

పాఠశాలల స్థాయి ఫుట్‌బాల్ విజేత వీ.వీ.పాలెం



విజేతలుగా నిలిచిన జట్లతో నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని మున్సిపల్ పార్క్‌లో ఆదర్శ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లాస్థాయి పాఠశాలల ఫుట్‌బాల్ పోటీల్లో వీ.వీ.పాలెం బాలబాలికల జట్లు నిలిచాయి. బాలుర ఫైనల్స్‌లో సర్దార్ పటేల్ స్టేడియం జట్టుపై, బాలికల విభాగంలో కొదుమూరు జెడ్పీహెచ్ఎస్ జట్టుపై వీ.వీ.పాలెం జట్లు విజయం సాధించాయి. ఈమేరకు విజేత జట్లతో పాటు ఉత్తమ క్రీడాకారులుగా సంధ్య, చరిత, ప్రశాంత్, చెన్నకేశవ, సమీర్‌రెడ్డి, యువ వర్షిత్‌కు విద్యాశాఖ సీఎంఓ రాజశేఖర్, హెచ్ఎం శ్యాంబాబు, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కిషోర్, సాయికుమార్, గోపిచంద్, పరుచూరి శివ, సీహెచ్.శివ, ఎలీషా, గోపి, మాధురి పాల్గొన్నారు.

నేడు హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మంగళవారం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లాస్థాయి సీనియర్ పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేయనున్నట్లు కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ వెంట తీసుకురావాలని సూచించారు.

స్వాహా చేసిన సొమ్ము రికవరీ

కామేపల్లి: స్త్రీనిధి రుణ వాయిదాల సొమ్ము వసూలు చేసినరూ.4లక్షల మేర నగదును గ్రామదీపికలు బ్యాంకులో జమ చేయకపోవడంతో సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ అంశంపై ఈ నెల 10న 'సాక్షి' కథనం ప్రచురింకాగా అధికారులు స్పందించారు. ఈ మేరకు శ్రీ చైతన్య గ్రామ సమాఖ్య గ్రామదీపిక ముత్తమ్మ నుంచి రూ.77 వేలు, జీవనజ్యోతి గ్రామ సమైఖ్య గ్రామదీపిక మంజుల నుంచి రూ.1.20లక్షలను స్త్రీనిధి ఖాతాకు సోమవారం జమ చేయించినట్లు ఏపీఓ సురేందర్‌బాబు తెలిపారు. మిగతా నగదు కూడా త్వరలో వసూలు చేస్తాయని ఆయన వెల్లడించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,000	7,650
కందులు	9,750	8,700
మినుములు	8,500	8,500
మిర్చి	22,300	14,200
మిర్చి తాలు	12,000	7,300
పత్తి	6,575	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,595

భ్రష్టుపడుతున్న విద్యారంగం

- ప్రపంచ ఆర్థిక సంస్థల చేతుల్లోకి 'చదువు'
- పుట్టగొడుగుల్లా విదేశీ యూనివర్సిటీలకు అనుమతి
- టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో ప్రొఫెసర్ హరగోపాల్



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, టీపీటీఎఫ్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుత పరిస్థితుల్లో పాలకులు రోజురోజుకు విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తున్నాయని అఖిల భారత విద్యాహక్కు వేదిక అధ్యక్షవర్గ సభ్యుడు, తెలంగాణ విద్యా పరిరక్షణకమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఆరోపించారు. ఖమ్మంలోని నయబజార్ పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడుతూ సమాజానికి, సమాజ ఆలోచనలకు అంతరాయం ఉండగా, విద్యారంగానికి జరగాల్సిన నష్టం ఇప్పటికే జరిగిపోయిందన్నారు. మత చాంధసవాదం ఎన్నికల వరకు వచ్చిందని తెలిపారు. అయితే, మతం అనేది వ్యక్తిగత విశ్వాసమని, దీన్ని రాజయాల్లో స్థానం ఇవ్వొద్దని సూచించారు. ఈ ఏడాది తర్వాత బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా, టీపీటీఎఫ్ సమాజ చైతన్యం కోసం కృషి చేయాల్సి అవసరముందని హరగోపాల్ సూచించారు.

వివిధ అంశాలపై ప్రసంగాలు

టీపీటీఎఫ్ మహాసభల్లో వివిధ రంగాల నిపుణులు పలు అంశాలపై మాట్లాడారు. భోపాల్ ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన బుర్రా రమేష్ 'నూతన విద్యా విధానం – రాజ్యాంగ విలువలు' అంశంపై మాట్లాడగా, ఐఎఫ్‌టీయూ జాతీయ కార్యదర్శి పి.ప్రసాద్ అంతర్జాతీయ పరిస్థితులు – ఫలితాలు, ప్రభావాలు అంశంపై, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ ప్రభుత్వ విధానాలు – ఆర్థిక సంక్షోభంపై, ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.నర్సింహారెడ్డి అంతరాల విద్య–ప్రజల హక్కు, ప్రభుత్వ బాధ్యత అంశంపై, హేతువాద రచయిత్రి చందనా చక్రవర్తి మహిళల స్థితిగతులు – కర్తవ్యాలు అంశంపై, మాట్లాడగా తొలుత మహాసభల సావనీర్‌ను హరగోపాల్ ఆవిష్కరించారు. అలాగే, ఈ మహాసభల్లో 14 తీర్మానాలు చేశారు. ఈసమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.అశోక్‌కుమార్, పి.నాగిరెడ్డి, ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు కె.లక్ష్మీనారాయణ, సహాధ్యక్షుడు మనోహర్‌రాజు, జిల్లా అధ్యక్షుడు ఏ.వీ.నాగేశ్వరరావు, ఎస్.విజయ్‌తో పాటు ముత్యాల రవీందర్, ఎస్.కనకయ్య, రవీందర్, పీ.కే.వేణుగోపాల్, ఎం.నాగిరెడ్డి ప్రకాశ్‌రావు, అజయ్‌బాబు, రామాచారి, శశిధర్‌రెడ్డి, నారాయణమ్మ, ఎస్.కవిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలివే..

టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో చేసిన తీర్మానాల వివరాలను నాయకులు వెల్లడించారు. నూతన జాతీయ విద్య విధానాన్ని రద్దు చేయాలని, కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టి అందరికీ నాణ్యమైన విద్యనందించాలేఖ, ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను విడనాడాలని, మహిళలు, దళితులపై జరుగుతున్న దాడుల నివారణకు దోషులను కఠినంగా శిక్షించాలని, కౌలు రైతుల సమస్యలను పరిష్కరించి రైతుల ఆత్మహత్యలు నివారించాలని, ఆదివాసీ, గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని తీర్మానించారు. అలాగే, ప్రభుత్వ వైద్యరంగాన్ని పటిష్టం చేయటంతో కార్పొరేటు అనుకూల విధానాలను విడనాడాలని, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా భర్తీకి క్యాలెండర్ ప్రకటించాలని, మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని రూపొందించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తూ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులు రద్దు చేసి, ప్రభుత్వ యూనివర్సిటీలకు నిధులు కేటాయించాలని, కల్తీ, కాలుష్యాన్ని అరికట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలనే తదితర తీర్మానాలు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపిక

- ఫ్లషింగ్ టాయిలెట్ రూపొందించిన కొణిజర్ల విద్యార్థి
- సేఫ్టీ డివైస్ సిద్ధం చేసిన సత్తుపల్లి బాలిక





గైడ్ టీచర్ హనుమతో రాష్ట్ర స్థాయికి ఎంపికైన మహేష్, గర్ల్స్ సేఫ్టీ డివైజ్‌తో మారుతి ప్రణీత

కొణిజర్ల/సత్తుపల్లి టౌన్: ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో 109 మంది విద్యార్థులు పాల్గొనగా పది మంది ప్రదర్శించిన ఎగ్జిబిట్లు రాష్ట్రస్థాయి ఎంపికయ్యాయి. ఇందులో కొణిజర్ల విద్యార్థి డేరంగుల మహేష్, సత్తుపల్లికి చెందిన మారుతి ప్రణీత తదితరులు ఉన్నారు. ఈమేరకు కొణిజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగగతి విద్యార్థి డేరంగుల మహేష్ రూపొందించిన ఆటోమేటిక్ ఫ్లషింగ్ టాయ్‌లెట్ రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికైంది. ఆయన ఫిజిక్స్ ఉపాధ్యాయుడు బి.హనుమ సూచనలతో ఈ ఎగ్జిబిట్ సిద్ధం చేశారు.

పని చేసే విధానం

రద్దీ ప్రాంతాలు, పాఠశాలల్లో ఏర్పాటుచేసే టాయ్‌లెట్లలో మూత్ర విసర్జన అనంతరం నీళ్లు పోయకపోతే దుర్వాసన వెదజల్లుతుంటాయి. దీనిని సరిచేసేందుకు మహేష్ ఆటోమేటిక్ ఫ్లషింగ్ టాయ్‌లెట్ సిద్ధం చేశారు. ఇందులో అడుగున స్ప్రింగ్‌పై బిగించి ఉంచిన బేసిన్‌పై ఎవరైనా మూత్రవిసర్జన చేయడానికి వెళ్లి నిలబడగానే స్ప్రింగ్ సాయంతో బేసిన్ కిందకు వెళ్లి నీళ్లు వచ్చి శుభ్రమవుతుంది. దీనిని తక్కువ ఖర్చుతోనే సిద్ధం చేయొచ్చని గైడ్ టీచర్ హనుమ తెలిపారు. ఈమేరకు రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి, గైడ్‌టీచర్‌ను ఎంఈఓ మోదుగు శ్యాంసన్, హెచ్‌ఎం శాంతకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

గర్ల్స్ సేఫ్టీ డివైజ్...

సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని మారుతి ప్రణీత రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికైంది. ప్రణీత రూపొందించిన గర్ల్స్ సేఫ్టీ డివైస్ ప్రాజెక్టు ప్రస్తుత సమాజంలో విద్య, ఉద్యోగ రంగాల్లో పని చేస్తున్న మహిళలు ఆపదలో ఉన్నప్పుడు రక్షించేందుకు ఉపయోగపడుతుంది. ఆమెకు గైడ్ టీచర్‌గా ఫిజిక్స్ ఉపాధ్యాయులు భద్రయ్య వ్యవహరించగా హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

దేశ ప్రజలను మభ్యపెడుతున్న మోడీ సర్కార్



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

ఖమ్మంమయూరిసెంటర్: దేవుడు, మతాన్ని రాజకీయాలు, ప్రభుత్వ యంత్రాంగంలోకి తీసుకొచ్చిన కేంద్రప్రభుత్వం మనోభావాల పేరిట ప్రజలను మభ్యపెడుతోందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు విమర్శించారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశాలు సోమవారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ముగియగా, ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ అన్నదాతలను విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు ఎరతివాచీ పరుస్తోందని మండిపడ్డారు. ఈమేరకు 29 కార్మిక చట్టాలను రద్దు చేసి బడా కంపెనీల యజమానులకు ఊడిగం చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం విధానాలను తిప్పికొట్టేలా ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అలాగే, ఈనెల 14న ఆదర్శ వివాహం చేసుకున్న దంపతులకు అభినందన సభలు నిర్వహించాలని సూచించారు. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీతో పాటు నాయకులు పాలడుగు నాగార్జున, నందిపాటి మనోహర్, డి.రాధాకృష్ణ, టి.సురేష్, దుర్గం దినకర్, మంద సంపత్, కోట గోపి, డి.రామమూర్తి, కొమ్ము శ్రీను, పాపిట్ల సత్యనారాయణ, బొట్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ విద్యాసొసైటీ ఉద్యోగుల నిరసన



నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు

రఘునాథపాలెం: తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ విద్యా సొసైటీ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిరసన తెలిపారు. రఘునాథపాలెంలోని పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపగా, సంఘం నాయకులు మాట్లాడారు. 2018, 2019సంవత్సరాల్లో నియామకమైన తమ పదోన్నతులు, బదిలీల ఊసెత్తడం లేదని ఆరోపించారు. ఈకార్యక్రమంలో లాలు, మమత, భారతి, తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

- 9వ తరగతి విద్యార్థికి పనిచేయని రెండు కిడ్నీలు
- చికిత్సకు రూ.4 లక్షలు అవసరమన్న వైద్యులు

దీనగాథ



బాధితుడు పోతనబోయిన గోపీ

కామేపల్లి: అనారోగ్యం ఆ పేద కుటుంబాన్ని వేధిస్తోంది. తొమ్మిదో తరగతి విద్యార్థి రెండు కిడ్నీలు పనిచేయకపోగా, అందిన కాడికి అప్పులు తెచ్చి చికిత్స చేయించినా ఫలితం దాతల చేయూత కోసం ఎదురుచూస్తున్నారు. వివరాలు... కామేపల్లి మండలం ముచ్చర్లకు చెందిన పోతనబోయిన నరసింహారావు – భవాని దంపతులకు కుమారులు నాగలాల్, గోపీ ఉన్నారు. గోపీ చిన్నతనంలోనే భవాని అనారోగ్యంతో మృతి చెందగా, నరసింహారావు, నాగలాల్ రోజువారీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా, గోపీ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతుండగా నెల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా రెండు కిడ్నీలు చెడిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఇప్పటి వరకు రూ.2 లక్షల వరకు అప్పు చేసి వైద్యం చేయించారు. అయితే, మెరుగైన వైద్యం కోసం సుమారు రూ.4లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో గోపీ తండ్రి నరసింహారావు, అన్న నాగలాల్ ఏం చేయాలో పాలుపోని స్థితి ఎదుర్కొంటున్నారు. ఈమేరకు దాతలు ముందుకొచ్చి ఆర్థికసాయం చేసి తమ కుమారుడికి పునర్జన్మనివ్వాలని గోపీ తండ్రి వేడుకుంటున్నాడు. దాతలు 76808 56301 నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా నగదు పంపించాలని ఆయన కోరాడు.

పార్టీ, ప్రజా సంఘాల బలోపేతమే లక్ష్యం

ఖమ్మంమయూరిసెంటర్: పార్టీతో పాటు ప్రజాసంఘాల బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ అనుబంధ ప్రజా సంఘాలన్నింటినీ గ్రామ గ్రామానికి తీసుకెళ్లేందుకు నాయకులు కృషి చేయాలని సూచించారు. రానున్న కాలంలో కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా పార్టీ కౌన్సిల్‌లో నిర్ణయించినట్లు తెలిపారు. సభ్యత్వాలను ఈనెల 20వరకు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కాగా, ఈనెల 16న జరిగే సార్వత్రిక సమ్మెలో పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కల్లూరురూరల్: మండలంలోని కల్లూరు, పుల్లయ్య బంజర్, పేరువంచ గ్రామాల్లో సివిల్ సప్లయీస్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురి ఇళ్లలో అక్రమంగా నిల్వచేసిన 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు బాధ్యులైన షేక్ జానీ, వంగల రాధ, మన్నే శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక...

మనోవేదనతో హోంగార్డు ఆత్మహత్య



నాగేశ్వరసూరి (ఫైల్)

కారేపల్లి: ఏడాది క్రితం ప్రమాదంలో కుమారుడు మరణించగా.. అప్పటి నుంచి మనోవేదనకు గురవుతున్న హోంగార్డు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా కారేపల్లికి చెందిన తిరునగరి నాగేశ్వరసూరి(52) మాధారం డోలమైట్ మైన్స్ టౌన్‌షిప్‌లో నివాసముంటూ మైన్స్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య నాగమణి కూసుమంచి కేజీబీవీలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. వీరి ఏకైక కుమారుడు తిరునగరి మహదేవ్ ఏపీలోని బాపట్లలో ఇంజనీరింగ్ చదువుతూ ఏడాది క్రితం స్నేహితులతో కలిసి అక్కడి బీచ్‌కు వెళ్లి ఈత కొట్టే క్రమంలో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆవేదన చెందుతున్న నాగేశ్వరసూరి కొడుకు లేని లోకంలో ఉండలేనంటూ ఆత్మహత్య చేసుకుందామని భార్యతో చెప్పేవాడు. దీంతో ఆమె ఆయనకు సర్దిచెబుతూ వస్తోంది. ఈక్రమంలోనే నాగేశ్వరసూరి భార్య నాగమణి శనివారం కూసుమంచి నుంచి వచ్చివెళ్లగా ఆదివారం ఒంటరిగా ఉన్న నాగేశ్వరసూరి రాత్రి 10గంటలకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం ఆయన భార్య చేస్తే స్పందించకపోవడంతో స్థానికులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి కిటికీ అద్దం పగులకొట్టి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించాడు. దీంతో సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ పుష్పాల రామారావు చేరుకుని మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కేఎంసీ వాటర్ ట్యాంకర్ బోల్తా



బోల్తా పడిన మున్సిపల్ ట్రాక్టర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన వాటర్ ట్యాంకర్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఖమ్మంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సోమవారం ఉదయం ట్రాక్టర్ బోల్తా పడగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అయితే, డ్రైవర్ ముందుజాగ్రత్తతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. అనంతరం క్రేన్ సాకారంతో ట్రాక్టర్‌ను పైకిలేపి పంపించారు.

పోగొట్టుకున్న 20 ఫోన్లు అప్పగింత



సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఏసీపీ శంకర్

ఖమ్మంక్రైం: వివిధ ప్రాంతాల్లో చేజార్చుకున్న 20 సెల్‌ఫోన్లను బాధితులకు సైబర్ క్రైమ్ ఏసీపీ శంకర్ సోమవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్ పోయినా, చోరీకి గురైనా సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే సైబర్ సెల్ బృందం ట్రాక్ చేసి స్వాధీనం చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కాగా, జిల్లాలో ఇప్పటివరకు సీఈఐఆర్ విధానంలో రూ.30లక్షల విలువైన 550 ఫోన్లను ట్రేస్ చేసి యజమానులకు అప్పగించినట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఉద్యోగులు రంజిత్‌కుమార్, విజయ్, సంతోష్, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి

ఎర్రుపాలెం: అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ బాలింతలు, గర్భిణులు, చిన్నారులపై సంక్షేమంపై మరింతగా దృష్టి సారించాలని జిల్లా సంక్షేమాధికారి సుమ సూచించారు. మండలంలోని జమలాపురం, బంజరల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఆతర్వాత బంజరలో అసంపూర్తి భవన నిర్మాణాన్ని ఆమె పరిశీలించి వివరాలు ఆరా తీశారు. ఈకార్యక్రమంలో సీడీపీఓ శారదాశాంతి, ఏసీడీపీఓ కృష్ణశ్రీ, వీరభద్రమ్మ, సూపర్‌వైజర్లు శశి, సరిత, రమణ తదితరులు పాల్గొన్నారు.



జమలాపురం సెంటర్‌లో మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ సుమ

దగ్గు, జలుబుతో గురుకుల విద్యార్థినుల సతమతం

వైరారూరల్: మండలంలోని ముసలమడుగులోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినులు పలువురు విపరీతమైన జలుబు, దగ్గుతో సతమతమవుతున్నారు. ఈ గురుకులంలో ముగ్గురు విద్యార్థినులకు ఐదు నెలల క్రితం క్షయగా నిర్ధారణ అయింది. దీంతో వారిని మెరుగైన వైద్యం కోసం ఇంటికి పంపించారు. అయితే, క్షయ మిగతా కొందరికి వ్యాపించిందని, జలుబు, దగ్గుతో బాధపడుతున్నట్లు సోమవారం ప్రచారం జరిగింది. పలువురు విద్యార్థినులను తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ విషయమై ప్రిన్సిపాల్ నాగేంద్రమ్మను వివరణ కోరగా గతంలో ఇద్దరికి క్షయ పాజిటివ్ వచ్చిన విషయం వాస్తవమేనని తెలిపారు. ఇప్పుడు ఇంకొందరు జలుబు, దగ్గుతో బాధపడుతుండగాచికిత్స చేయిస్తున్నామని పేర్కొన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం

కారేపల్లి: ప్రమాదవశాత్తు వరిగడ్డి వాము దగ్ధమైన ఘటన మండలంలోని పోలంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు భూక్యా భద్రు తన రెండెకరాల వరిగడ్డి వామును ఇంటి సమీపంలో వేశాడు. సోమవారం ప్రమాదవశాత్తు వాముకు నిప్పంటుకుంది. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తూనే అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమచారం ఇవ్వగా ఇల్లెందు నుంచి వాహనం వచ్చేలోగా రూ.40వేల విలువైన గడ్డి పూర్తిగా కాలిపోయింది.

చెల్లని చెక్కు కేసులో జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమంలో చెల్లని చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు శ్రేణి న్యాయస్థానం న్యాయాధికారి కాసరగడ్డ దీప సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మంకు చెందిన బిజ్జాల భాస్కర్ బీ.కే.బజార్‌కు చెందిన వుల్లి శ్రీనివాసరావు వద్ద 2016లో రూ.2లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ అప్పు చెల్లించే క్రమంలో 2018లో భాస్కర్ చెక్కు జారీ చేశాడు. అయితే, ఆయన ఖాతాలో సరిపడా నగదు నిల్వ లేకపోవడంతో చెక్కు బౌన్స్ అయింది. దీంతో న్యాయవాది సిద్ధంశెట్టి వెంకటేశ్వరరావు ద్వారా శ్రీనివాసరావు కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేయగా, భాస్కర్‌కు ఆరు నెలల జైలుశిక్ష విధించడంతో పాటు ఫిర్యాదికి రూ.3లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

రైలుక్రింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మంకు చెందిన ఓ వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం సుందరయ్య నగర్‌కు చెందిన తోట రాంబాబు(35) కొంతకాలంగా మద్యానికి బానిసై తిరుగుతున్నాడు. దీంతో కుటుంబకలహాలు తలెత్తటంతో సోమవారం చర్చి కాంపౌండ్ బ్రిడ్జి వద్ద రైలు కింద ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో ఆయన మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు.

15 డ్రమ్ముల పామాయిల్ స్వాధీనం

సత్తుపల్లి: వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 15 డ్రమ్ముల పామాయిల్‌ను సోమవారం సత్తుపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని హనుమాన్ నగర్ సెంటర్‌లో ఎస్సై వెంకటరాజు ఆధ్వర్యాన వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా వ్యాన్‌లో పామాయిల్ తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు స్థానికుడైన గాదే సురేష్‌తో పాటు ఆరుగురిని విచారించగా, పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే లారీ ట్యాంకర్ల డ్రైవర్ల వద్ద కొనుగోలు చేసి హైదరాబాద్ తీసుకెళ్లి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తేలింది. దీంతో వ్యాన్ సహా నిందితులను అదుపులో తీసుకోగా ఎస్సై శ్రావణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.